క్లుప్తంగా

నకిలీ పట్టాలపై విచారణ

నర్సంపేట : పోడు భూముల నకిలీ పట్టా పాస్ బుక్కుల వ్యవహారంపై జిల్లా అటవీ శాఖ అధికారులు సృజనకుమారి ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. పట్టణంలోని పలు బ్యాంకుల నుంచి బుధవారం వివరాలు సేకరించారు. పలువురికి నకిలీ పాస్ బుక్కులు ఇచ్చి భద్రు అనే వ్యక్తి బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న ఉదంతం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఏ బ్యాంకులో ఎంత రుణం తీసుకున్నారనే విషయమై ఆరా తీస్తున్నట్లు తెలిసింది. కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ సుధాకర్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

నియామకం

నర్సంపేట రూరల్ : నర్సంపేట నర్సింగ్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా మహబూబాబాద్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలకు చెందిన సువత్సలను, ఇన్‌చార్జి వైస్ ప్రిన్సిపాల్‌గా జగిత్యాలకు చెందిన చంద్రకళలను ప్రభుత్వం నియమించింది. బుధవారం నర్సంపేట మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌దాస్‌కు రిపోర్ట్ చేసి బాధ్యతలను స్వీకరించారు. అనంతరం వారిని పలువురు అభినందించారు.

పేదలకు ప్రభుత్వ వైద్యం కరువు



నర్సంపేట : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు ప్రభుత్వ వైద్యం కరువైందని బీఆర్ఎస్ నేత, స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆందోళన వెలిబుచ్చారు. ఈ మేరకు పట్టణంలోని తన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో చరిత్రలో నిలిచిపోయేలా పట్టణంలో వైద్య కళాశాల, జిల్లా ఆస్పత్రి, డయాలసిస్ సెంటర్, బ్లడ్‌బ్యాంక్, తదితరాలు ఏర్పాటు చేశామన్నారు. గ్రామీణ ప్రజల కోసం 58 పల్లె దవాఖానలు నిర్మించినట్టు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పేదల ఆరోగ్యాన్ని పట్టించుకున్న నాథుడే కరువయ్యాడని చెప్పారు. పెద్దాస్పత్రిలో మందులు, అత్యవసర ఇంజెక్షన్ల కొరత ఉందని తెలిపారు. పేదలకు మెరుగైన వైద్యం అందించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమీక్షించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.

ముల్క లక్ష్మీనర్సయ్య సేవలు అభినందనీయం



సంగెం : గ్రామీణ డాక్ సేవక్‌గా ముల్క లక్ష్మీనర్సయ్య 44 ఏళ్లపాటు అందించిన సేవలు అభినందనీయమని పోస్టల్ శాఖ వరంగల్ సౌత్ సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వరప్రసాద్ తెలిపారు. మండలంలోని ధర్మారం సబ్ పోస్టాఫీసులో ఉద్యోగ విరమణ సందర్భంగా లక్ష్మీనర్సయ్యను వరప్రసాద్, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సతీసమేతంగా బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ సూపరింటెండెట్ వరప్రసాద్ మాట్లాడారు. లక్ష్మీనర్సయ్య సేవలను కొనియాడారు. ఉద్యోగ విరమణ పొందినా ఆయన అందించిన సేవలు గుర్తుంటాయని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌పీఎంలు శివకుమార్, నీలిమ, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలి

సంగెం : సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు రాజ్యాంగ ఫలాలు అందాలని ఎంపీడీఓ కాసర్ల రవీందర్ ఆకాంక్షించారు. మండలంలోని తీగరాజుపల్లిలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. దళితులంతా విద్యావంతులై హక్కులు తెలుసుకుని వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలు కులమతాలకు అతీతంగా కలిసి మెలిసి జీవించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై నరేశ్, ఎంఆర్‌ఐ శారద, పంచాయతీ కార్యదర్శి మమత తదితరులు పాల్గొన్నారు.

'ఎస్ఆర్ఆర్' చేయూత

రాయపర్తి : మండలంలోని తిర్మలాయపల్లికి చెందిన వశపాక సాలమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చేయూత అందించింది. ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో ప్రతినిధులు బియ్యం, నూనె అందజేశారు. అనంతరం పరామర్శించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు యూసుఫ్, నరోత్తమ్ రెడ్డి, గజవెల్లి ప్రసాద్, గజేందర్‌రెడ్డి, వశపాక రవి, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

నర్సంపేట : ఈనెల 3న హైదరాబాద్‌లో తలపెట్టిన ధర్మ సమాజ్ పార్టీ మహా సమ్మేళనం కార్యక్రమ కరపత్రాలను పట్టణంలోని వల్లభ్‌నగర్‌లో మండల అధ్యక్షుడు సంగాల శివకృష్ణ బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. జనాభాలో 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, అణగారిన వర్గాలకు విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు సాధనే లక్ష్యంగా పార్టీ ఉద్యమించనుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చందు, చరణ్, అనిల్, రాజేశ్, బన్నీ, విల్సన్, క్రాంతి, వేణు, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ వినియోగంలో జర భద్రం

● గడువు దాటితే పెను ప్రమాదం

వర్ధన్నపేట : మందులు కొనుగోలు చేసేప్పుడు ఎక్స్పైరీ తేదీ చూస్తాం. కూరగాయలు సైతం సరిగ్గా చూశాకే కొంటాం. వంట గ్యాస్ సిలిండర్ ఎక్స్పైరీ డేట్ ఎప్పుడైనా చూశామా? ఆశ్చర్యపోకండి. గ్యాస్ సిలిండర్‌కు నిర్దిష్ట కాలపరిమితి ఉంటుంది. గడువు దాటిన సిలిండర్‌ను వినియోగిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

గుర్తించడం ఇలా..

సిలిండర్‌పై భాగంలో తేదీ ముద్రించి ఉంటుంది. అలాగే సిలిండర్‌పై ఏ, బీ, సీ, డీ అక్షరాలతోపాటు రెండు అంకెలు ఉంటాయి. ఏ అంటే జనవరి నుంచి మార్చి వరకు, బీ అంటే ఏప్రిల్ నుంచి జూన్ వరకు, సీ అంటే జులై నుంచి సెప్టెంబర్ వరకు, డీ అంటే అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు అని అర్థం. సిలిండర్‌పై డీ–24 ఉందనుకుంటే రీ క్యాలిబ్రేషన్ (సిలిండర్‌కు చేసే పరీక్ష) తేదీ అక్టోబర్ నుంచి డిసెంబర్ 2024 వరకు అని అర్థం చేసుకోవాలి.

గడువు దాటితే ప్రమాదమే...

సిలిండర్ రాగానే దాని వాల్వ్, సీల్‌ను చెక్ చేయడం పరిపాటి. ఇక కోడ్ కూడా చెక్ చేయండి. సిలిండర్ గడువు ముగిస్తే మరోటి ఇవ్వమని అడగాలి. నెలల తరబడి నిల్వ ఉంచితే ప్రమాదమే.

గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు..

రెండేళ్లకోసారి కనెక్షన్ పూర్తిగా చెక్ చేయించాలి. రబ్బరు ట్యూబ్‌ను తరచూ పరిశీలించాలి. పగుళ్లు పడితే మార్చాలి. పగుళ్లు పడకున్నా రెండేళ్లకోసారి మార్చాలి. ఐఎస్ఐ మార్కు కలిగిన స్టౌ, రబ్బరు ట్యూబులనే వినియోగించాలి. సిలిండర్ వాడకంలో లేనప్పుడు సేఫ్టీ కేప్ పెట్టి ఉంచాలి. గ్యాస్ వాసన వస్తే రెగ్యులేటర్ ఆఫ్ చేసి పరిశీలించాలి. డిస్ట్రిబ్యూటర్‌కు లేదా అత్యవసర సేవా కేంద్రాలకు సమాచారం ఇవ్వాలి. రాత్రి వేళల్లో రెగ్యులేటర్‌ను తప్పనిసరిగా ఆఫ్ చేయాలి. ఆ సమయంలో ఎలక్ట్రికల్ స్విచ్‌లు ఆన్ చేయొద్దు. వంట గదిలో గాలి వచ్చేలా కిటికీలు కొంత మేర తెరిచి ఉంచాలి.



జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి



గ్యాస్ సిలిండర్ వినియోగంలో వినియోగదారులు జాగ్రత్తలు తీసుకోవాలి. సూచనలు పాటించడం వినియోగదారుల బాధ్యత. ఈ–కెవైసీ తప్పనిసరి. ప్రభుత్వ ఉద్యోగులు సహా వినియోగదారులందరూ ఈ–కెవైసీ చేయించుకోవాలి.

–తుమ్మల శ్రీధర్, మేనేజర్, రోనీ గ్యాస్ ఏజెన్సీ

అకాల వర్షం.. అపార నష్టం..



చెన్నారావుపేట : రాములు తండా శివారులో నేలవాలిన వరి పంట

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం మధ్యాహ్నం కురిసిన అకాల భారీ వర్షానికి అపారమైన పంటల నష్టం వాటిల్లింది. నెక్కొండ మండలంలో వరి పంటల్లో నీరు నిలిచి రైతులు ఆందోళనకు గురయ్యారు. కోత దశకు వచ్చిన వరి పంటలు భారీగా దెబ్బతిన్నాయి. రేసులబోడు తండాలో పలువురి వరి పంట నీట మునిగింది. చెన్నారావుపేట మండలంలోని గ్రామాల్లో పిడుగులతో కూడిన వర్షం కురిసింది. వందలాది ఎకరాల్లో వరి పంట నేలవాలినట్టు తెలిసింది. ఖానాపురం మండలవ్యాప్తంగా ఉరుములతో కూడిన వర్షం కురిసింది. మిర్చి, పత్తి, వరి రైతులకు భారీ నష్టం వాటిల్లింది. వరి, మిర్చి తోటలు నేలవాలిపోయాయి.



నెక్కొండ : నీట మునిగి నేలకొరిగిన వరి

సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యం

● సీపీఎం జిల్లా కార్యదర్శి రంగయ్య

నర్సంపేట : ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య స్పష్టం చేశారు. పట్టణంలోని ఐఎంఏ ఫంక్షన్ హాలులో ఆ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు శ్రీధర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశానికి రంగయ్య హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కులాలు, మతాల పేరుతో దుష్టపాలన సాగిస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం హామీలు విస్మరించి మోసపూరితన పాలన సాగిస్తోందని ధ్వజమెత్తారు. పాలకుల తప్పుడు విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. అనంతరం నవంబర్ 29, 30 తేదీల్లో జరగనున్న జిల్లా మహాసభల నిర్వహణ కోసం ఆహ్వాన సంఘం కమిటీని ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడిగా చింతమల్ల రంగయ్య, అధ్యక్షుడిగా ఈసంపల్లి బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భూక్య సమ్మయ్య, కార్యదర్శిగా కోరబోయిన కుమారస్వామి, కోశాధికారిగా హన్మకొండ శ్రీధర్, ఉపాధ్యక్షులుగా సింగార బాబు, నలిగంటి రత్నమాల, నమిండ్ల స్వామి, బషీర్, బోళ్ల సాంబయ్య, ముంజాల సాయిలు, ఆరూరి కుమార్, తదితరులతో కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు బెంబేరి మల్‌హల్‌రావు, కత్తి కట్టయ్య, పెండ్యాల సారయ్య, అన్వర్, కందికొండ రాజు, గడ్డమీది బాలకృష్ణ, పరికి మధుకర్, మొగులోజు శారద, పుచ్చకాయల కృష్ణారెడ్డి, నర్సింహారెడ్డి, ముంజాల రమేష్, బొడ్డు రవి, కడియాల మనోహర్, బొడిగే సమ్మయ్య, కందికట్ల వీరేశ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రంగయ్య

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక



పర్వతగిరి: విద్యార్థులతో ప్రిన్సిపాల్ అపర్ణ

పర్వతగిరి : హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో మంగళవారం జరిగిన ఎస్‌జీఎఫ్ఐ అండర్–19 పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పర్వతగిరి టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ విద్యార్థినులు అమూల్య 53 కేజీల విభాగం, పూజ 60 కేజీల విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, ఫిజికల్ డైరెక్టర్ బొట్ల స్రవంతి, పీఈటీ మమతలను బుధవారం ప్రిన్సిపాల్ అభినందించారు. వివిధ క్రీడల్లో విద్యార్థినులు తేజస్వి, శైలజ, అమూల్య, గగన, సాయివైష్ణవి, అక్షయ, వైష్ణవి, అక్షయ, రుచిత పాల్గొన్నట్లు తెలిపారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు..

చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లి హైస్కూల్ విద్యార్థి బాదావత్ ప్రశాంత్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సునీత తెలిపారు. పాఠశాల ఆవరణలో ప్రశాంత్‌తోపాటు వ్యాయామ ఉపాధ్యాయురాలు స్వప్నను ఇన్‌చార్జ్ హెచ్‌ఎం అభినందించి మాట్లాడారు. జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ పోటీల్లో 9వ తరగతి విద్యార్థి ప్రశాంత్ ప్రతిభ కనబర్చి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాగి శేఖర్, సంతోష్‌కుమార్, పిన్నింటి బాలాజీరావు, ఉదయ్‌కుమార్, సీహెచ్ మాధవి, మొగిళి, సుందర్, కె. మాధవి, రమాదేవి, రామకృష్ణ, జాహెద్, ఇందిర పాల్గొన్నారు.



చెన్నారావుపేట : విద్యార్థిని అభినందిస్తున్న ఇన్‌చార్జి హెచ్‌ఎం సునీత

నందిగామ స్కూల్ నుంచి..

నల్లబెల్లి : మండలంలోని నందిగామ హైస్కూల్ విద్యార్థి గుండెబోయిన సన్నీ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్‌లో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. సన్నీని హెచ్‌ఎం, వ్యాయామ ఉపాధ్యాయుడు నాగరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఖానాపురం : మండలంలోని మంగళవారిపేటకు చెందిన చంద్రు రెండు కాళ్లు కోల్పోయి అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయన మంజూరైన రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును మాజీ ఎంపీటీసీ పూల్ సింగ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బొమ్మగాని నవీన్ బుధవారం అందజేశారు. అనంతరం పూల్‌సింగ్, నవీన్ మాట్లాడారు. అనారోగ్యంతో బారిన పడి చికిత్స చేయించుకోలేని పేదలకు ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పులిగిల్ల నాగరాజు, మచ్చ వెంకన్న, ఇంద్రారెడ్డి, మల్లేశ్, స్వామి దాస్, కుమారస్వామి, సునీల్, సదన్, చంద్రు, రవీందర్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న నాయకులు

ఘనంగా ముందస్తు దీపావళి



నర్సంపేట : పట్టణంలోని అక్షర ద స్కూల్, బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్‌లో బుధవారం దీపావళి పండుగను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ముందు రంగురంగుల ముగ్గులు వేసి దీపాలు వెలిగించి బాణసంచా కాల్చుతూ సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. పండుగలపై అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దీపావళి జరుపుకుంటున్నట్టు చెప్పారు. అనంతరం కృష్ణునితో కలిసి సత్యభామ నరకాసురుని వధించిన తీరును విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ట్రెజరర్ వనజ, బాలాజీ విద్యాసంస్థల సెక్రటరీ రాజేశ్వర్‌రెడ్డి, బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆర్.జ్యోతి, అక్షర ద స్కూల్ ప్రిన్సిపాల్ భవానీ, సీఏఓ సురేశ్ పాల్గొన్నారు.

సమగ్ర సర్వే పకడ్బందీగా చేపట్టాలి

సంగెం : సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ రవీందర్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఓంప్రకాశ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దుగ్గొండి : సామాజిక, ఆర్థిక, కులగణనకు సన్నద్ధం కావాలని ఎంపీడీఓ అరుంధతి కోరారు. పంచాయతీ కార్యదర్శుల పాత్ర, 54 అంశాలతో కూడిన ప్రశ్నావళి వివరించారు. ఎంపీఓ శ్రీధర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటిని కలిసిన ఎమ్మెల్యే

వర్ధన్నపేట : వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ఆధ్వర్యంలో జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య, మైనార్టీ విభాగం నాయకుడు ఎండీ చోటు తదితరులు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, వరంగల్ ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని బుధవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు.పూలబొకే అందించి శాలువాతో సన్మానించారు. వీరి వెంట నాయకులు ఎండీ వలీపాష, సురారపు నిరంజన్, కందిక ఎల్లస్వామి, దుపెల్లి స్వామి, తదితరులు ఉన్నారు.

పశుమైత్రిలుగా గుర్తించాలని వినతి

నర్సంపేట రూరల్ : పదేళ్లుగా సేవలు అందిస్తున్న క్రమంలో తమను పశుమైత్రిలుగా గుర్తించాలని కోరుతూ నసీమా, పుష్పలత ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు హైదరాబాద్‌లో బుధవారం వినతిపత్రం అందజేశారు. తొలుత మంత్రికి పూలబొకె అందించారు. అనంతరం నసీమా, పుష్పలత మాట్లాడారు. పశుమైత్రిల పరిస్థితి దయనీయంగా మారిందని చెప్పారు. డ్రెస్‌కోడ్, ఐడీ కార్డులు అందించడంతోపాటు కనీస వేతనం అమలు చేయాలని కోరారు.

సన్మానం

రాయపర్తి : తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరి ప్రీతమ్‌ను కాంగ్రెస్ సెల్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు గబ్బెట బాబు ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. అనంతరం బాబు విలేకరులతో మాట్లాడారు. ఢిల్లీలో దళిత నాయకులతో లోక్‌సభ సభ్యుడు రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో పాల్గొని వచ్చిన సందర్భంగా ప్రీతమ్‌ను కలిసినట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్, వంకల రుద్రయ్య, కుమార్, సాయిలు, ప్రశాంత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ వీసీకి..

నర్సంపేట : కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ (వీసీ)గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆచార్య ప్రతాప్‌రెడ్డిని నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్, అధ్యాపకులు బుధవారం శాలువాతో సన్మానించారు. అనంతరం పూలమొక్క బహూకరించారు. తదనంతరం పరిశోధన, అకాడమిక్ అంశాలపై వీసీతో ప్రిన్సిపాల్ నవీన్ చర్చించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బైరి సత్యనారాయణ, ఎం.సోమయ్య, ఎం.రాంబాబు, ఎస్.కమలాకర్, ఆర్.గణేశ్, ఆర్.రుద్రాణి, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో..

వర్ధన్నపేట : టీఎన్‌జీఓల సంఘం పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరమ్ జిల్లా కోశాధికారిగా మండలంలో విధులు నిర్వహిస్తున్న ఆకుల పృథ్వీరాజ్, జిల్లా సెక్రటరీగా హుస్సేన్ ఎన్నికైన సందర్భంగా వారిని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటరమణ, ఎంపీఓ ధరలక్ష్మి ఆధ్వర్యంలో ఉద్యోగులు బుధవారం శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఫోరమ్ కార్యవర్గంలో పదవులు పొందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు మురళి, సురేశ్, అన్వేశ్, రామారావు, బుస శ్రీనివాస్, జ్యోతిలత, రాజు, దేవేందర్, ప్రణీత్, శ్రీకర్, నాగిరెడ్డి, సహజ, రత్నం, రాజ్, తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట : అంబేడ్కర్ సెంటర్‌లో బాణసంచా కాలుస్తున్న నాయకులు

పోరాటాలతోనే 'విద్యుత్' ఉపశమనం

నర్సంపేట : బీఆర్ఎస్ పోరాటాల వల్లే విద్యుత్ చార్జీల పెంపు నుంచి ప్రజలకు ఉపశమనం లభించిందని ఆ పార్టీ జిల్లా నాయకుడు నల్లా మనోహర్ రెడ్డి తెలిపారు. ప్రజలపై రూ.18,500 కోట్ల విద్యుత్ భారం మోపేలా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిటీ (ఈఆర్‌సీ) తిరస్కరించిందని ఆయన చెప్పారు. ఆ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో బుధవారం సంబరాలు నిర్వహించారు. బాణాసంచా పేల్చారు. నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో ఏనాడూ విద్యుత్ చార్జీలు పెంచలేదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది కూడా గడవక ముందే భారీగా విద్యుత్ చార్జీలు పెంచేందుకు సిద్ధపడిందని చెప్పారు. ప్రభుత్వం ప్రతిపాదనపై ప్రతిపక్షంగా పబ్లిక్ హియరింగ్‌లో పాల్గొని ఈఆర్‌సీ మీద ఒత్తిడి తెచ్చి తిరస్కరించేలా ఒప్పించినట్టు తెలిపారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్ర నుంచి ఇప్పటివరకు ప్రధాన ప్రతిపక్ష వాదనలోని సహేతుకతను, న్యాయాన్ని విని సంపూర్ణంగా చార్జీల పెంపు ప్రతిపాదనలను ఈఆర్‌సీ తిరస్కరించడం ఇదే తొలిసారి అని చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకుడు డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి వేణుముద్దల శ్రీధర్‌రెడ్డి, పట్టణ ప్రచార కార్యదర్శి మండల శ్రీనివాస్, కౌన్సిలర్లు నాగిశెట్టి పద్మ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గురిజాల క్రాస్ రోడ్డులో..

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామ శివారులోని గురిజాల క్రాస్ రోడ్డు వద్ద బీఆర్ఎస్ శ్రేణులు బాణాసంచా పేల్చి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఈర్ల నర్సింహ రాములు, కోమాండ్ల గోపాల్‌రెడ్డి, మోతె పద్మనాభరెడ్డి, మోటూరి రవి, బానోత్ వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై

రాయపర్తి : మండల కేంద్రంలోని వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు టపాసులు పేల్చి సంబరాలు నిర్వహించారు. విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదనను ఈఆర్‌సీ తిరస్కరించడంతో హర్షం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ మాత్రమే ప్రజల పక్షమంటూ నినాదాలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహా నాయక్, జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి మాట్లాడారు. ప్రజల పక్షాన పోరాడేది బీఆర్ఎస్ మాత్రమేనని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, ఆకుల సురేందర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ కుందూరు రామచంద్రారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, ఉపాధ్యక్షుడు నయీమ్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

● పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

సంగెం : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా సమన్వయ కమిటీ సభ్యులు పని చేయాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సూచించారు. పార్టీ ముఖ్యనాయకులతో తన నివాసంలో బుధవారం ఆయన సమీక్షించారు. బీఆర్ఎస్ హయాంలో, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులపై చర్చించారు. అనంతరం ధర్మారెడ్డి మాట్లాడారు. గత ఎన్నికలకు ముందు ఇచ్చిన అనేక హామీలను కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం విస్మరించి మోసపూరిత పాలన సాగిస్తున్నట్టు తెలిపారు. అనేక ఆశలతో కాంగ్రెస్‌ను గెలిపించిన అన్ని వర్గాల ప్రజల్లో అసహనం నెలకొందని చెప్పారు. ఆరు గ్యారంటీలను అమలు చేయకపోవడంతో రైతులు, ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందన్నారు. నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉంటూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంతోపాటు బీఆర్ఎస్ హయాంలో ప్రజలకు అందించిన పథకాలను, చేపట్టిన అభివృద్ధిని వివరించి అవగాహన కల్పించి చైతన్యవంతం చేయాలని సూచించారు. తద్వారా గ్రామాల వారీగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. నాయకులకు, కార్యకర్తలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, ఆ పార్టీ మండల అధ్యక్షుడు సారంగపాణి, నాయకులు సుదర్శన్‌రెడ్డి, సదానందం, సమ్మయ్య, దిలీప్‌రావు, మల్లయ్య, గోవర్ధన్, ఉండీల రాజు, మన్సూర్ అలీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మారెడ్డి

సంక్షిప్తంగా

'రైతుమిత్ర' కార్యవర్గం ఎన్నిక

చెన్నారావుపేట : మండలంలోని జల్లి గ్రామంలో రైతుమిత్ర పరపతి సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వంగపండ్ల చిన్న రాజు, ఉపాధ్యక్షుడుగా మేరుగు రాజు, కోశాధికారిగా నాంపెల్లి చిన్న నర్సయ్య, గౌరవ అధ్యక్షులుగా అంబాల రవి, కొంకాల భద్రస్వామి, కొంకాల బాబు, సభ్యులుగా సంగం రమేశ్, జంపాల వీరన్న, తుమ్మేటి సుధాకర్, పిల్లల వీరన్న, నల్లగుంట్ల శ్రీను, సందీప్‌రెడ్డి, వంగపల్లి అనిల్ ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్షుడు చిన్న రాజు, ఉపాధ్యక్షుడు మేరుగు రాజు మాట్లాడారు. ఐకమత్యంతోనే అభివృద్ధి సాధించగలమని చెప్పారు. సంఘం సభ్యుల సంక్షేమానికి పాటుపడతామని తెలిపారు. సంఘాన్ని బలోపేతం చేస్తామన్నారు.

బీసీ సంఘం అధికార ప్రతినిధిగా అశోక్

ఖానాపురం : బీసీ సంఘం నర్సంపేట నియోజకవర్గ అధికార ప్రతినిధిగా మండలంలోని బుధరావుపేటకు చెందిన కోడి అశోక్ యాదవ్‌ను నియమించారు. ఈ మేరకు అశోక్‌కు నియోజవకర్గ ఇన్‌చార్జ్ డ్యాగల శ్రీనివాస్ మండల కేంద్రంలో నియామక పత్రాన్ని బుధవారం అందజేశారు. అనంతరం అశోక్ మాట్లాడారు. బీసీలు ఏకం కావాలని ఆకాంక్షించారు. సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం పోరాడతామని చెప్పారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

దుగ్గొండి : తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీఓ అరుంధతికి పలువురు పంచాయతీ కార్యదర్శులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి తమను శాశ్వత ఉద్యోగులుగా పరిగణించాలని, ఈజీఎస్‌లో సోషల్ ఆడిట్‌లో వెలుగు చూసే అవినీతికి బాధ్యులను చేయొద్దని, మృతి చెందితే రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, తదితర సమస్యలు వివరించారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీధర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హామీల అమలు కోసం జేఏసీల నిర్మాణం

ఖానాపురం: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుపర్చుకోవడం కోసం ఉద్యమకారుల జేఏసీ నిర్మాణాన్ని చేపట్టడం జరుగుతుందని ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ అంబటి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మండలంలోని ఐనపల్లి ఐటీఐ కళాశాల ఆవరణలో బుధవారం ఉద్యమకారుల ఐక్య కార్యాచరణ కమిటీ ఏర్పాటు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటులో ఉద్యమకారుల పాత్ర కీలకమైందన్నారు. ఉద్యమకారులంతా ఒకే తాటిపై ఉండి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయించుకునేందుకు జేఏసీలో చురుకుగా ఉండాలన్నారు. అనంతరం మండల ఉద్యమకారుల చీఫ్ అడ్వైజర్‌గా వెంకటనారాయణ, అడహక్ కన్వీనర్లుగా కోడి మల్లేశ్, కందికట్ల జయను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో డివిజన్ కన్వీనర్ గుంటి రాంచందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబరాతి మల్లేశం, జగన్, చీఫ్ అడ్వైజర్ జావిద్, కాంతమ్మ, శోభ, తదితరులు పాల్గొన్నారు.

వరి పంటలో క్షేత్ర ప్రదర్శన

రాయపర్తి : మండలంలోని కొండూరులో గ్రామానికి చెందిన రైతు పోలినేని శ్రీధర్ వరి పొలంలో జీనియస్ సీడ్స్ ఆధ్వర్యంలో జీనియస్–101 రకం వరిపై బుధవారం క్షేత్రప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమేశ్ మాట్లాడారు. జీనియస్ 101 రకం అధిక దిగుబడి వస్తుందని, నాణ్యత ఉంటుందని తెలిపారు. అనంతరం రైతును సత్కరించారు.

భార్య కాపురానికి రావడం లేదని..

వర్ధన్నపేట : భార్య కాపురానికి రావడం లేదని, ఆత్మహత్య చేసుకుంటానంటూ యువకుడు వాటర్ ట్యాంక్ ఎక్కిన ఘటన మండలంలోని శ్రీరామోజిగూడెంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. కుమ్మరిగూడెంకు చెందిన భూక్య గణేశ్‌కు ముగ్గురు సంతానం. కుటుంబ కలహాలతో భార్య కొద్ది రోజుల క్రితం పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో గణేశ్ మద్యం సేవించి గ్రామంలోని వాటర్ ట్యాంక్ ఎక్కి దూకుతానంటూ బెదిరింపులకు దిగాడు. గ్రామస్తులు ఆయన్ను నచ్చజెప్పి కిందకు దించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వర్ధన్నపేట : ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఒకదానికి మరొకటి ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలిలా.. మండలంలోని బండౌతాపురం గ్రామానికి చెందిన గజ్వెల్లి ప్రభు వర్ధన్నపేట నుంచి దమ్మన్నపేటకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా నందనం నుంచి వర్ధన్నపేట దిశగా వస్తున్న బెల్లి రాజు, పెరుమాండ్ల రఘు ప్రయాణిస్తున్న బైక్‌కు ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రభుకు, రఘుకు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరినీ 108లో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

పరామర్శ

నల్లబెల్లి : మండలంలోని రంగాపురంలో ఇటీవల బండారి లక్ష్మి, శనిగరంలో కక్కెర్ల గణపతి మృతి చెందగా బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. తొలుత మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు.

ఝాన్సీరెడ్డికి..

రాయపర్తి : తొర్రూరులో షాపింగ్ మాల్ ప్రారంభిస్తున్న క్రమంలో జరిగిన ప్రమాదంలో గాయపడ్డ కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిని నాయకులు బుధవారం పరామర్శించారు. ఝాన్సీరెడ్డి త్వరగా కోలుకోవాలని ఆలయాల్లో పూజలు చేసినట్టు నాయకులు తెలిపారు.